# నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 15 నవంబర్ 2024 | HYDERABAD




## సర్వే తెచ్చిన తంటా..!

సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ) : మూలిగే నక్కపై తాటి పండు పడిందన్న చందంగా 'సర్వే' జీహెచ్ఎంసీకి సరికొత్త తంటాను తెచ్చిపెట్టింది.సంస్థకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తిపన్ను వసూళ్లపై ఈ సర్వే ప్రభావం తీవ్రంగా పడుతున్నది. ప్రభుత్వం గడిచిన ఆరు రోజులుగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు దాదాపు 19వేల మంది పాల్గొంటుండగా.. ఈ నెల 30వ తేదీ వరకు ఈ సర్వేలోనే వీరంతా కొనసాగుతారు. వీరికి సర్వే బాధ్యతలు రావడంతో ఆస్తి పన్ను వసూళ్లలో వేగం మందగించింది.గడిచిన 14 రోజుల్లో ఆస్తిపన్ను రూపంలో దాదాపు రూ. 10కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఈ సమయానికి రూ. 30కోట్ల మేర ఆదాయం రావాల్సి ఉంది. కానీ సర్వే కారణంగా వసూళ్లపై అధికారులు ఏం చేయలేని పరిస్థితి. వాస్తవంగా గత నెలలో రూ.56 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఉద్యోగుల జీతాల చెల్లింపులపై కాస్త ప్రభావం చూపింది.ఈ నెలలో మాత్రం ఆస్తి పన్ను వసూళ్లు అసలే లేకపోవడంతో ఉద్యోగుల జీతాలు ఎప్పుడు చెల్లిస్తారో అన్న చర్చ జరుగుతున్నది.



### అర్ధరాత్రి కారు బీభత్సం..

## 12 మందికి గాయాలు

సుల్తాన్‌బజార్, నవంబర్ 14:నాంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో 12 మంది గాయపడ్డారు. పోలీసు లు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజేందర్‌నగర్‌కు చెందిన అహ్మద్ మాలిక్(32) మద్యం మత్తులో వేగంగా కారును నడుపుతూ.. బిర్యానీ కోసం బజార్‌ఘాట్‌లోని అహ మద్దుల్లా హోటల్‌కు వెళ్తున్న క్రమంలో రెడ్‌హిల్స్ నిలోఫర్ కేఫ్ వద్ద చాయ్ తాగుతున్న జనాలపైకి దూసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో 12 మందికి గాయపడ్డారు. వీరిలో మోయినుద్దీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. కారుతో పాటు ఎనిమిది బైకులు ధ్వంసమయ్యాయి. మద్యం మత్తులో కారు నడిపిన అహ్మద్ మాలిక్‌ను స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

## కుటుంబ సర్వే పత్రాలు నడిరోడ్డుపాలు

*ఎంతో భద్రంగా..గోప్యంగా ఉంచాల్సిన సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు ఇలా రోడ్డపాలయ్యాయి. గురువారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి దాటిన తర్వాత మేడ్చల్ - నిజామాబాద్ దారిలో రేకుల బావి చౌరస్తా నుంచి భారత్ పెట్రోల్ బంక్ వరకు 44వ జాతీయ రహదారి పొడవునా దర్శనమిచ్చాయి. సమాచారం అందుకున్న మేడ్చల్ మున్సిపాలిటీ కమిషనర్ నాగిరెడ్డి హుటాహుటీనా సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. అన్ని ఫారాలు ఫారాలను సేకరించి, తన వాహనంలో కార్యాలయానికి తీసుకెళ్లారు. దేశానికే దిక్సూచి, సామాజిక న్యాయమంటూ అత్యంత ఆర్భాటంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు.. ఇలా రోడ్డుపై కనిపించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయమై కమిషనర్‌ను వివరణ కోరగా, జాతీయ రహదారి వెంట సమగ్ర కుటుంబ సర్వే ఫారాలు పడి ఉన్నట్లు తనకు సమాచారం వచ్చిందన్నారు. వెంటనే అక్కడికి వెళ్లి, దరఖాస్తులను సేకరించినట్లు చెప్పారు. అర కిలోమీటరు వరకు ఫారాలు పడి ఉన్నాయని ఆయన చెప్పడం గమనార్హం.*

**- మేడ్చల్, నవంబర్ 14 :**



## రాష్ట్రంలో 12% మందికి షుగర్ వ్యాధి



సుల్తాన్‌బజార్, నవంబర్ 14: తెలంగాణ రాష్ట్రంలో 12 శాతం మంది మధుమేహ వ్యాధితో బాధపడుతున్నారని, షుగర్ వ్యాధి ప్రమాదకరంగా పెరుగుతోందని, ప్రజలు తక్షణమే అప్రమత్తమై పరీక్షలతో వ్యాధిని గుర్తించి ఆరోగ్యవంతమైన జీవనశైలిపై దృష్టి సారించాలని ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకనాథ్ రెడ్డి, శాఖ కార్యదర్శి డాక్టర్ అశోక్ అన్నారు. ప్రపంచ డయాబెటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవేళ ఎవరికైనా షుగర్ వ్యాధి నిర్ధారణ అయితే అదేదో రుగ్మత అని భావించవద్దని సూచించారు. జీవనశైలిని మార్చుకోవాలని, ప్రతి రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం, ఫైబర్, ఫ్రూట్స్, గ్రెయిన్స్, వెజిటేబుల్స్‌తో కూడిన ఆహారాలను తీసుకోవడం ఉత్తమమని చెప్పారు. ఇంటి వద్దే నిత్యం పరీక్షించుకునేలా గ్లూకో మీటర్లను సమకూర్చుకోవడం, వ్యాధిలో ఎలాంటి తీవ్రత ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని వారు సూచించారు.

### ఫేక్ ఓటర్ కార్డుతో

# ఆధార్.. పాస్‌పోర్ట్

### ఆర్ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లో దందా.. టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడిన ముఠా

**ఇప్పటికే నకిలీ 1000 ఓటర్ ఐడీలు**

**750 బర్త్ సర్టిఫికెట్లు, 1500 ఆధార్ కార్డులు పొందిన నేపాలీలు**

**ముఠాగుట్టు రట్టు చేసిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్**

**ఆరుగురు నిందితుల అరెస్టు**

**ఇతర విదేశీయులు సర్టిఫికెట్లు పొందారా.. అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం**

**సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ):**

నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా గుట్టురట్టయింది. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను పట్టుకున్నారు. గురువారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ భవన్‌లో టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ కలాసిగూడకు చెందిన యెల్గం రాజ్‌కుమార్ ఆర్ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. సర్వశిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేసే ఎల్బీనగర్ ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఎండీ మహబూబ్‌కు స్కూళ్లలో ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు చేసేందుకు అనుమతి ఉంది. ఈ అవకాశాన్ని అక్రమ పద్ధతిలో ఆర్ఎస్ ఆన్‌లైన్‌లోనూ వాడుకుంటున్నారు. రాచమల్ల విజయ లక్ష్మి, కురపాటి పల్లవి ఈ సర్వీస్ సెంటర్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తూ డెస్క్‌టాప్ అప్లికేషన్ మ్యాజికల్/యూనివర్సల్ యాప్‌లను ఉపయోగించి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేయడం, నకిలీ సంతకాలు చేయడం చేస్తుంటారు. పాస్ పోర్ట్ ఏజెంట్‌గా పని చేస్తున్న బండి శంకర్, జీహెచ్ఎంసీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే గిరిరాజ్ అనిల్‌కుమార్‌తో ఒక ముఠాను ఏర్పాటు చేశారు.

#### ఓటర్ ఐడీ కార్డు తయారు చేస్తారు..

ఆర్ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లో వివిధ రకాల సేవలు అందిస్తుంటారు. ఇందులో భాగంగా అసలైన ఓటర్ ఐడీ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్, బర్త్, పాన్ కార్డులు ఇస్తుంటారు. దీంతో పాటు అవసరమైన వారికి నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అర్హత లేని వారికి ఇక్కడి నుంచి ఆధార్ కార్డు, పాస్‌పోర్టు కావాలని ఆయా ఏజెంట్లు కస్టమర్లను ఈ ముఠా నాయకుడు రాజ్‌కుమార్‌కు అప్పగిస్తారు. వచ్చిన కస్టమర్‌కు మొదట నకిలీ ఐడీ కార్డును తయారు చేస్తారు. ఆ చిరునామాను ఉపయోగించి ఆధార్ కార్డుకు దరఖాస్తు చేసి.. ఆధార్ కార్డును పొందుతారు. ఆ తరువాత అదే చిరునామాతో పాస్‌పోర్టును పొందుతారు. ఇలా వివిధ రకాలైన సర్టిఫికెట్లు తయారు చేస్తూ మీ సేవలు, ఇతరత్రా ఆన్‌లైన్ సర్వీస్‌లు నిర్వహించే వారితో పాటు పలువురు ఏజెంట్లను నియమించుకొని కస్టమర్లను రప్పించుకుంటూ.. నకిలీ సర్టిఫికెట్ల దందా చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సెంటర్ నుంచి పదేండ్లలో 1200 పాస్‌పోర్టులు జారీ అయితే.. అందులో 50 నకిలీ డాక్యుమెంట్లను ఉపయోగించి.. పాస్ పోర్టులు పొందినట్లు డీసీపీ వెల్లడించారు.

**2015 నుంచి ఈ సెంటర్ నుంచి జారీ అయిన అసలు, నకిలీ సర్టిఫికెట్ల డేటా వివరాలు!**

| డాక్యుమెంట్ల వివరాలు | అసలైనవి | నకిలీవి | మొత్తం |
|---|---|---|---|
| ఓటర్ ఐడీ కార్డులు | 35000 | 15000 | 50000 |
| ఆధార్‌కార్డులు | 20000 | 10000 | 30000 |
| పాస్‌పోర్ట్ స | 1200 | 50 | 1250 |
| బర్త్ సర్టిఫికెట్లు | - | 2000 | 2000 |
| పాన్ కార్డులు | - | 1500 | 1500 |

#### ఫేక్ గెజిటెడ్ సంతకాలు..

ఆర్ఎస్ ఆన్‌లైన్ సర్వీస్ నిర్వాహకుడి ఏజెంట్ శ్రావణ్ కుమార్‌ను గతేడాది జూన్‌లో నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్ట్ చేశారని, ఆ సమయంలో అతడు 9 ఏండ్ల డేటాను పూర్తిగా ధ్వంసం చేశాడని డీసీపీ వెల్లడించారు. పదేండ్లలో 50 వేల ఓటర్ కార్డులు జారీ అయ్యాయని తెలిపారు. ఈ ఏడాది కాలంలో జారీ చేసిన నకిలీల వివరాలు కంప్యూటర్ నుంచి పోలీసులు సేకరించారు. ఇందులో నలుగురు ప్రభుత్వ అధికారుల పేరుతో స్టాంప్‌లు తయారు చేసి వారికి తెలియకుండా వీళ్లే గెజిటెడ్ సంతకాలు చేస్తున్నారు. ఇదిలాఉండగా నకిలీ ఓటర్ ఐడీ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లను ఉపయోగించి నేపాల్ దేశానికి చెందిన వారు పాస్ పోర్టులు పొందారని డీసీపీ వివరించారు. నేపాల్‌కు చెందిన వారు వెయ్యి నకిలీ ఓటర్ ఐడీ కార్డులు, 750 నకిలీ బర్త్ సర్టిఫికెట్లు, 1500 ఫేక్ ఆధార్ కార్డులు సేకరించినట్లు డీసీపీ వెల్లడించారు. ఈ కేసులో మరింత లోతుగా దర్యాప్తు జరుపాల్సి ఉన్నదని, ఇతర దేశస్తులు నకిలీ సర్టిఫికెట్లు వెళ్లి పాస్‌పోర్టులు పొందారా? అనే విషయాలు ఆరా తీయాల్సి ఉన్నదని డీసీపీ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వైవీఎస్ సుధీంద్ర



## ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్

### క్షణాల్లో ఆహార నాణ్యత నిర్ధారణ

**మొబైల్ వాహనంలో పరీక్షలు.. జోన్‌కు ఒకటి చొప్పున ఏర్పాటు**

సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : రోడ్డుపక్కన మిర్చీ బండి.. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్.. ఫైవ్ స్టార్ హోటల్.. స్థాయి ఏదైనా వాటిలో లభించే ఆహార పదార్థాల్లో ఏదో ఒక రూపంలో కల్తీ జరుగుతున్నదని ఆహార పరిరక్షణ సంస్థ నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడవుతున్నది. టీ పొడి, పాలు, పండ్లు, పప్పులు, సాస్‌లు, చక్కెరతో చేసే మిఠాయిలు, నూనె, కారం పొడి, బేకరీ ఉత్పత్తులు, నిల్వ తీపి పదార్థాలు, హోటళ్లలో తయారు చేసిన ఆహారాల వరకు అన్నింటిలోనూ నాణ్యతా ప్రమాణాలు లోపించాయని తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. కొరవడిన ప్రమాణాలు సగటు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ నేపథ్యంలోనే ఆహార నాణ్యత విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఆహార నాణ్యత విషయంలో అనుమానం ఉంటే అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించి..నిర్ధారించనున్నారు. రోజూ వాడే ఆహార పదార్థాల్లో కల్తీ జరుగకుండా నిరంతర పర్యవేక్షణ చేసేందుకు ఫుడ్ సెక్యూరిటీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రయోగాత్మకంగా 'ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్' మొబైల్ వ్యాన్‌ను గత ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ మొబైల్ వ్యాన్‌తో సత్ఫలితాలు వస్తుండటంతో జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో జోన్‌కు ఒకటి చొప్పున ఈ మొబైల్ వ్యాన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. త్వరలోనే జోన్‌కు ఒకటి చొప్పున ఈ వ్యాన్‌ను అందుబాటులోకి తేస్తామని అధికారులు తెలిపారు. ఈ మొబైల్ వాహనంలో అక్కడికక్కడే నాణ్యతను నిర్ధారించనున్నారు. హానికరం, నకిలీ (మిస్ బ్రాండెడ్), నాసిరకం ఇలా మూడు రకాల ప్రమాణాలపై పరీక్షలు జరుపుతారు. కల్తీ ఉన్నట్లు గుర్తిస్తే అవగాహన, చైతన్యం కలిగించి ముందస్తుగా హెచ్చరికలు జారీ చేస్తారు. మరోసారి పునరావృతమైతే జరిమానాలు, శిక్షణ విధిస్తారు. ప్రతి రోజూ ఒక్కో సర్కిల్‌లో పర్యటించి ఆహార నాణ్యతల నిగ్గు తేల్చే పనిలో జీహెచ్ఎంసీ నిమగ్నమైంది. ఆహార నాణ్యతా ప్రమాణాల విషయంలో అనుమానాలుంటే జీహెచ్ఎంసీ టోల్ ఫ్రీ నంబర్ 040- 2111 1111లో సంప్రదించాలని అధికారులు కోరారు.

## మసకబారుతున్న నగర ఖ్యాతి

*స్వచ్ఛ నగర ఖ్యాతి మసకబారుతున్నది. సిటీలో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు కనిపిస్తున్నాయి. షేక్‌పేట దర్గారోడ్‌లో ఇలా వ్యర్థాలు పేరుకుపోయాయి. ఫలితంగా పరిసరాలన్నీ దుర్గంధంగా మారుతున్నాయి. దుర్వాసనతో అటువైపున వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.*



## ధ్రువీకరణపత్రాల పునఃపరిశీలన

సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : డీఎస్సీ 2024కి ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలపై ఆరోపణలు వస్తుండటంతో విద్యాశాఖ పునఃపరిశీలనకు నిర్ణయించింది. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పునః పరిశీలించాలని నిర్ణయించింది. ఈనెల 20 నుంచి ఈ ప్రక్రియను నిర్వహించాలంటూ సర్క్యులర్ జారీ చేసింది. దీంతో స్పోర్ట్స్ కోటా కింద ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. గ్రేటర్ పరిధిలో స్పోర్ట్స్ కోటా కింద సుమారు 84 మంది అభ్యర్థులు ఎంపికై విధులు నిర్వహిస్తున్నారు. అందులో హైదరాబాద్‌లో 71 మంది, రంగారెడ్డి జిల్లాలో 13 మంది ఎంపికయ్యారు. ఈనెల 20న హైదరాబాద్ పరిధిలోని అభ్యర్థులకు, 21న రంగారెడ్డి జిల్లా పరిధిలోని అభ్యర్థులకు దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉండనున్నది.

## భిక్షమెత్తి కష్టాలు వివరించి..

### 2వ రోజూ ఆటో డ్రైవర్ల నిరసన

తెలంగాణ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో నగరంలో రెండో రోజు గురువారం ఆటో డ్రైవర్ల నిరసన కొనసాగింది. బీఎంఎస్ అనుబంధ సంస్థ తెలంగాణ స్టేట్ ఆటో అండ్ టాక్సీ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నగరంలోని ఉప్పల్, నాచారం, ఈసీఐఎల్ తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేపట్టి.. తాము పడుతున్న కష్టాలను ప్రజలకు వివరించారు. ఉచిత బస్సు పథకం ఆటో డ్రైవర్ల జీవితాల్లో చీకట్లు నింపిందని.. ఆదుకోవాల్సిన సర్కార్ చోద్యం చూస్తున్నదని విమర్శించారు. ఏడాదికి రూ. 12వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కారు..ఇప్పటికీ అమలు చేయలేదని మండిపడ్డారు. పోరాటం ఉధృతం చేసి కాంగ్రెస్ మోసపూరిత ని ఎండగడుతామని ఆటో డ్రైవర్లు హెచ్చరించారు. ఈ నిరసనలో బీపీటీఎంఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హబీబ్, గిరి, ప్రతాప్, నారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**- సిటీబ్యూరో, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ)**



*బాలల దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ లోని బోయిన్‌పల్లి మనోవికాస్‌నగర్‌లో గురువారం దివ్యాంగులకు ప్రత్యేక పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సుమారు 500 మంది పిల్లలు పాల్గొన్నారు.*

## వాటర్ ప్లాంట్ సీజ్..

అంబర్‌పేట, నవంబర్ 14 : నిబంధనలకు విరుద్ధంగా వివిధ బ్రాండ్ల పేర్లతో ఓ వ్యక్తి కల్తీ మినరల్ వాటర్‌ను తయారు చేసి బాటిళ్లలో విక్రయిస్తున్నాడు. దీంతో బల్దియా ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ ప్లాంట్‌ను సీజ్ చేశారు. అందుబాటులో ఉన్న కొన్ని వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసముండే షేక్ ఉమర్ కాచిగూడ నింబోలి అడ్డాలో వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నాడు. ప్రధాన కంపెనీల బ్రాండ్లకు సంబంధించిన పేర్లు పోలే విధంగా అల్ఫాబెటికల్‌లో అక్షరం కొద్దిగా తేడా ఉండేలా బాటిళ్లను రూపొందించి.. అందులో టోటల్ డిసాల్ట్ సాలిడ్స్ తక్కువగా ఉండే నీటిని నింపి విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న అధికారులు గురువారం ఆ ప్లాంట్ పై దాడి చేసి..నీటిని పరీక్షించారు. ఇందులో 75కు మించి టోటల్ డిసాల్ట్ సాలిడ్స్(టీడీఎస్) ఉండాల్సింది పోయి కేవలం 18 టీడీఎస్ మాత్రమే ఉంది. దీంతో అధికారులు ఆ ప్లాంట్‌ను సీజ్ చేశారు.



నింబోలిఅడ్డాలో వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు